
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



సోమశిలలో 29.825 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 29.825 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 862 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.65,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,898
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,075
నవర (8 గ్రాములు)	రూ.48,600

గరిష్టం/కనిష్టం
24.9 /22.6

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 100 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా జడివాన కురిసింది. మంగళవారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

మిచాంగ్ బీభత్సం

రహదారులు, అండర్ పాస్ బ్రిడ్జిలు జలమయం

- కూలిన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు
- ముమ్మరంగా సహాయక చర్యలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలింపు
- నేడు కూడా పాఠశాలలకు సెలవు



జలమయమైన నెల్లూరులోని వైఎస్సార్ నగర్

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్ జిల్లాలో బీభత్సం సృష్టిస్తోంది. సోమవారం భారీ వర్షాలతో నెల్లూరు నగరం, జిల్లాలోని పలు ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. జనజీవనం స్తంభించింది. తుఫాన్ తీవ్రతను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టేలా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశాలిచ్చారు. మత్స్యకారులు సముద్రంలోకి, పెన్నానదిలోకి వెళ్లకూడదంటూ నిషేధాజ్ఞలు జారీ చేశారు. కృష్ణపట్నం పోర్టులో 10వ నంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఎడతెరిపి లేని వర్షంతో బుజబుజనెల్లూరు, వైఎస్సార్ నగర్, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ తదితర ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. ఆత్మకూరు బస్టాండ్ అండర్ పాస్ బ్రిడ్జిలో వర్షపునీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విజయ మహల్ గేటు బాక్స్‌టైప్ బ్రిడ్జి వద్ద కూడా వర్షపునీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. వీఆర్సీ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నీట మునిగింది. మాగుంట లేఅవుట్ అండర్ పాస్ బ్రిడ్జి వద్ద వర్షపునీరు భారీగా చేరింది. మాగుంట లేఅవుట్ చెరువును తలపిస్తోంది. శివారు ప్రాంతాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. పోలీసు, అగ్నిమాపక, విద్యుత్‌శాఖల సిబ్బంది పునరుద్ధరణ చర్యలను వేగవంతంగా చేపడుతున్నారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

తుపాను ప్రభావంతో జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో కలెక్టర్, అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ఎక్కడికక్కడ సమీపంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు 1,900 మందిని ఈ కేంద్రాలకు తరలించారు. రెడ్‌క్రాస్ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ బృందంతో ఇందిరమ్మకాలనీ, సుందరయ్యకాలనీ ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహార పొట్లాలు, బిస్కెట్లు, పాలు అందజేశారు. తమిళ జాలర్లు నాలుగు రోజులుగా సముద్రంలో చిక్కుకుని సోమవారం తెల్లవారుజామున జువ్వలదిన్నె సమీపంలో హార్బర్ వద్ద 23 మరబోట్లతో ఒడ్డుకు చేరారు. సమీపంలో లంగరు వేసి తమిళ జాలర్లను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉలవపాడు మండలం కరేడులో పునరావాస కేంద్రానికి చేరిన ప్రజలతో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడారు. పునరావాస కేంద్రంలో బాధితులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. మిచాంగ్ తుఫాన్ మంగళవారం మధ్యాహ్నం లోపు జిల్లాలో తీరం దాటే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ పేర్కొంది.

నేడూ విద్యాసంస్థలకు సెలవు

తుఫాన్ తీవ్రరూపం దాల్చుతున్నట్లు వాతావరణశాఖ ఇచ్చిన సమాచారంతో మంగళవారం కూడా విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. విద్యార్థులు సురక్షితంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

జిల్లాలో 65.7 మి.మీ. సగటు వర్షపాతం

మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో సోమవారం సగటున 65.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. గరిష్టంగా నెల్లూరురూరల్‌లో 243.4 మి.మీ. వర్షపాతం నమోదు కావడం గమనార్హం. నెల్లూరు అర్బన్‌లో 243.2 మి.మీ., ఇందుకూరుపేట మండలంలో 200.2, విడవలూరులో 184.8, వెంకటాచలంలో 181.2, కోవూరులో 176.2, తోటపల్లిగూడూరులో 162.6, ముత్తుకూరులో 156.6, మనుబోలులో 150.4, కొడవలూరులో 132.4, సైదాపురంలో 97.6, బుచ్చిరెడ్డిపాలెంలో 92.8, అల్లూరులో 62.2, దగదర్తిలో 52.6, పొదలకూరులో 43.4, కావలిలో 40.2, రాపూరులో 40, బోగోలులో 35.2, కలిగిరిలో 23.8, సంగంలో 21.8, కందుకూరులో 20 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

కావలి: తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ప్రజలకు తాగునీరు, భోజన సదుపాయాలు పక్కాగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి కావలిలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఆర్డీఓ కార్యాలయంలో తుఫాన్ సహాయ, పునరావాస చర్యలపై అధికారులతో సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తగ్గేవరకూ ప్రజలు బయటకు రావద్దని ప్రజలను కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ శీనానాయక్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ ఉన్నారు.

న్యూస్‌రీల్

తుఫాన్ తీవ్రతపై ముందు జాగ్రత్తలు

- ముఖ్యమంత్రికి వివరించిన కలెక్టర్



ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం లేకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లతో తుఫాన్ ముందస్తు చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ తుఫాన్ వల్ల ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా చూడటమే అందరి లక్ష్యం కావాలన్నారు. కేవలం మనుషుల ప్రాణాలే కాకుండా పశువులు, మూగజీవాలు రక్షణకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకొని తుఫాన్ నష్టాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాలన్నారు. కలెక్టర్ జిల్లాలో తీసుకున్న ముందస్తు జాగ్రత్తల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలోని 110 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో భారీ వర్షాల వల్ల నీరు చేరుతుందన్నారు. ఇప్పటికే 2 ఎన్డీఆర్ఎఫ్, 2 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు జిల్లాకు చేరాయన్నారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్‌మర్మత్, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థకు రూ.కోటి నష్టం

- 107 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్ సంస్థకు రూ.కోటి మేర నష్టం వాటిల్లింది. ఆది, సోమ వారాల్లో కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. జిల్లాలో మొత్తం 107 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోగా, ఇప్పటికే 46 ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించారు. అలాగే 27 సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గూడూరు డివిజన్‌లో 11, కావలి డివిజన్‌లో 8, నాయుడుపేట డివిజన్‌లో 4, కోవూరు డివిజన్‌లో 1, నెల్లూరు టౌన్ డివిజన్‌లో 3 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వీటిలో 16 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు. అలాగే 33 కేవీ విద్యుత్ స్తంభాలు 40 పడిపోగా వాటిలో 26 స్తంభాలను పునరుద్ధరించారు.

వైద్యులకు సెలవుల రద్దు

నెల్లూరు సిటీ: జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)లో అధికారులు, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ సిద్దానాయక్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జీజీహెచ్‌లో ఐదుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. హెచ్ఓడీ కళారాణి చాంబర్ వద్ద ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

వీడని వర్షం.. తీరని నష్టం



నెల్లూరు గాంధీ గిరిజనకాలనీలో నీట మునిగిన ఇళ్లు



పూర్తిగా మునిగిపోయిన రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి



బోగోలు-కప్పరాళ్లతిప్ప మార్గంలో రోడ్డుపై కూలిన వృక్షం



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



బోగోలు మండలం ఉడ్‌హౌస్‌పేట వద్ద కూలిన విద్యుత్ స్తంభం



వింజమూరు మోటుచింతలపాలెంలో ధ్వంసమైన అరటితోట



పొదలకూరు మండలంలో కలుజు పారుతున్న పొట్టేళ్లవాగు చెరువు



పొదలకూరు మెయిన్ రోడ్డులో కూలిన భారీ చెట్టు

మేమున్నామంటూ ఆపన్నహస్తం



ఇందిరమ్మకాలనీలో స్థానికుడితో మాట్లాడుతున్న ఎంపీ ఆదాల



కావలి పునరావాస కేంద్రంలో కలెక్టర్‌తో ఎమ్మెల్యే రామిరెడ్డి



నెల్లూరులో ఆహార ప్యాకెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు వెంకటేశ్వరపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్



ఉలవపాడు పునరావాస కేంద్రంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి



ఇందుకూరుపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



రామాయపట్నం పోర్టు నుంచి పునరావాస కేంద్రానికి తరలింపు



నెల్లూరులో కూలిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సహాయక చర్యలు చేపట్టండి

- అధికారులను ఆదేశించిన మంత్రి కాకాణి
- జెడ్పీ సమావేశ మందిరంలో తుఫాన్‌పై సమీక్ష
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్, ఎస్పీ



తుఫాన్ పరిస్థితులపై సమీక్షిస్తున్న మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(పొగతోట): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీస్తున్నందున జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై సోమవారం మధ్యాహ్నం నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిలతో కలిసి మంత్రి కాకాణి రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, పునరావాస కేంద్రాల్లో భోజన వసతి ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ బలహీనంగా ఉన్న చెరువులను, కాలువలను గుర్తించి వాటికి గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు పడిపోతే వెంటనే వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి విద్యుత్ శాఖ ఎస్ఈని ఆదేశించారు. ఎక్కడైనా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు దెబ్బ తిన్నా, కోతకు గురైనా ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేసి వర్షపునీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతోపాటు అధికారులతో సమావేశమై తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 54 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేశామని తెలిపారు. తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో పోలీస్ బృందాలను నియమించామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి పనిచేసేలా ప్రణాళికలు రూపొందించామని, రెస్క్యూ బృందాలను మరింత అప్రమత్తం చేశామని వివరించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు వల్ల ఏదైనా సంఘటన జరిగితే వెంటనే సంబంధిత శాఖ అధికారులు పోలీసుశాఖకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్పీ అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసిన్హా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఉజ్వల' అమలు వివరాలను తెలపండి



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఉజ్వల పథకం ద్వారా రాష్ట్రంలో ఇచ్చిన ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ల వివరాలను వెల్లడించాలని పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సోమవారం ప్రశ్నించారు. ప్రభుత్వం రూ.200 సబ్సిడీ ఇస్తున్న అంశం.. ప్రస్తుతం నాలుగు సిలిండర్లకు పెంచింది నిజమేనానని ప్రశ్నించారు. వినియోగాన్ని పెంచేందుకు గానూ సబ్సిడీని రూ.400కు పెంచడాన్ని పరిశీలిస్తోందానని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి సమాధానమిచ్చారు.

దుకాణంపై కూలిన చెట్టు



పొదలకూరు: తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు మండలంలోని డేగపూడి క్రాస్‌రోడ్డు వద్ద ఓ దుకాణంపై చెట్టు కూలింది. దీంతో లక్ష్మీ కూల్‌డ్రింక్స్ ముందు భాగం రేకులు దెబ్బతిన్నాయి. యజమాని రాము ఆ సమయంలో దుకాణంలోనే ఉన్నా ముందు భాగంపై చెట్టు కూలడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

వర్షపునీరు సాఫీగా సముద్రంలోకి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నక్కల కాలువను పరిశీలిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: మండలంలోని నక్కల కాలువ వద్ద చేపట్టిన పూడికతీత పనులతో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సుమారు ఆరు వేల క్యూసెక్కుల వర్షపు నీరు సముద్రంలోకి సాఫీగా వెళ్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో మండలంలోని పొట్టెంపాడు వద్ద గల నక్కల కాలువను అధికారులు, రైతులతో కలిసి సోమవారం పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడారు. గతంలో నక్కల కాలువ పొంగితే రైతుల పంట పొలాలు మునిగిపోయేవని, గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకునేవని తెలిపారు. అయితే ప్రస్తుతం సుమారు ఆరు వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్లేలా చేపట్టిన పూడికతీత పనులు సత్ఫలితాలనిచ్చాయని తెలిపారు. సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి 15 గేట్లెత్తి, కనుపూరు కాలువ మీదుగా నీటిని నక్కల వాగుకు విడుదల చేశామని వివరించారు. 15 ఏళ్లుగా ఈ కాలువను ఎవరూ పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు.



పునరావాస కేంద్రంలో ఉన్న వారికి సాయాన్ని అందిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

అందరూ అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మండలంలో సోమవారం పర్యటించిన ఆయన మైపాడు, గంగపట్నం, రాముడుపాలెం, ఇందుకూరుపేట తదితర గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులను పరామర్శించారు. ఇక్కడి గిరిజనులకు ఆర్థిక సాయాన్ని అందజేయడంతో పాటు పాలు, బిస్కెట్లు తదితరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అనేక జాగ్రత్తలను చేపట్టిందని తెలిపారు. తీర ప్రాంత వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. తీరంలో ఉన్న వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించి భద్రపర్చుకోవాలని సూచించారు. నీరు సజావుగా పారేలా పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని వెల్లడించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అత్యవసరమైతేనే బయటకు రావాలని కోరారు. గ్రామాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, అన్ని శాఖల అధికారులు సేవలను సమర్థంగా అందిస్తున్నారని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, కోవూరు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై వీరేంద్రబాబు, నేతలు గురజాల బుజ్జిబాబు, సంగం వెంకయ్య, శ్రీహరికోట ప్రసాద్, పంబాల జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి విడుదలపై సమీక్ష



మంత్రి కాకాణితో మాట్లాడుతున్న ఎంపీ ఆదాల

- ఇరిగేషన్ అధికారులతో మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల సమావేశం

నెల్లూరు(దర్గామిట్ట): సోమశిల నుంచి కనుపూరు కాలువ ద్వారా సాగునీటి విడుదలకు సంబంధించి ఇరిగేషన్ అధికారులతో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం సమీక్షించారు. డైకస్‌రోడ్డులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. జిల్లా రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సాగునీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సోమశిల నుంచి 2.2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. 15 రోజులుగా సోమశిల ప్రాజెక్ట్ ద్వారా నీటిని విడుదల చేయలేదని, ప్రస్తుతం మరో ఆరేడు టీఎంసీల వరకు అదనంగా చేరిందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో రెండు టీఎంసీల వరకు నీరు చేరిందని వివరించారు. కనుపూరు కాలువ కింద రైతులు ఇప్పటికే నారుమడులు వేసుకొని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తాగునీటి అవసరాల కోసం నెల్లూరు చెరువుకు సైతం నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సత్తార్, తాళ్లూరు అవినాష్, పార్టీ నేతలు స్వర్ణా వెంకయ్య, హరిబాబుయాదవ్, చెన్నారెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యంత్రాంగం అప్రమత్తం

కందుకూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. కందుకూరులో లోతట్టు ప్రాంతాలైన ఉప్పుచెరువు, జనార్దనకాలనీ పుట్ట ఏరియా, ఏఎంసీ కాంపౌండ్ పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఏఎంసీ ఆవరణలోని గోడౌన్, పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పరిశీలించి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కందుకూరు మండల పరిషత్ కార్యాలయంలో తుఫాన్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా 79933 43869, 79818 48725, 98858 02663 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. లింగసముద్రం మండలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు, సంచార జాతుల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. రామాయపట్నం పోర్టు వద్ద సముద్రంలోకి వచ్చిన చెన్నైకు చెందిన 100 మంది మత్స్యకారులను కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక పర్యవేక్షణలో చేవూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, రామదూత ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ఉలవపాడు మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన రామాయపట్నం, చాకిచర్ల, పెదపట్టపుపాళెం, కరేడు, ఉలవపాడులో ఎమ్మెల్యే పర్యటించారు. కరేడు పంచాయతీ బాలకోటయ్య సంఘంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పరిశీలించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.35
సన్నవి : రూ.20
పండ్లు : రూ.6

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.85
లేయర్	: రూ.90
బ్రాయిలర్ చికెన్	: రూ.162
స్కిన్‌లెస్ చికెన్	: రూ.182
లేయర్ చికెన్	: రూ.153

సిబ్బంది సిద్ధంగా ఉండాలి

- అగ్నిమాపక శాఖ డీజీ సునీల్‌కుమార్

నెల్లూరు(క్రైమ్): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అగ్నిమాపకశాఖ డీజీ సునీల్‌కుమార్ సూచించారు. నెల్లూరుకు సోమవారం చేరుకున్న ఆయన తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల అగ్నిమాపకశాఖ అధికారులతో జూమ్ సమావేశాన్ని నిర్వహించి విపత్తును సమర్థంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. తుఫాన్ తీవ్రత తగ్గేంత వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా రెస్క్యూ ఆపరేషన్లను నిర్వహించాలని సూచించారు. ఎన్డీఆర్‌ఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో చేపడుతున్న సహాయక చర్యలను జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి వివరించారు. అగ్నిమాపక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జ్ఞానసుందరం, ఏడీఎఫ్ఓ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తం

లింగసముద్రం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తమయ్యామని ప్రాజెక్టు డీఈ లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.7 అడుగుల మేర నీరుందని, తుఫాన్ ప్రభావంతో ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే నీరు చేరే అవకాశం ఉందన్నారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు చేరితే గేట్లు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ప్రాజెక్టు వద్ద ముగ్గురు జేఈలు, లష్కర్లతో అప్రమత్తంగా ఉన్నామని పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ సీటు పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ఎంబీబీఎస్ సీటును ఇప్పిస్తామంటూ మోసగించిన మహిళపై దర్గామిట్ట పోలీసులు చీటింగ్ కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్లోని ఓ అపార్ట్‌మెంట్‌లో లలిత, సౌందర్య కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. తనకు పలు వైద్య కళాశాలల ప్రిన్సిపల్స్ తెలుసని.. మీ కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామంటూ లలితను నమ్మించి రూ.30 లక్షలను తీసుకున్నారు. అనంతరం పట్టించుకోకపోవడంతో సౌందర్యను బాధితురాలు పలుమార్లు నిలదీసినా సరైన సమాధానం చెప్పలేదు. ఘటనపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు

నెల్లూరు(క్రైమ్): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. నదీ, సముద్రతీర ప్రాంతాలు, డ్యామ్‌లు, చెరువులు, వాగుల వద్ద పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపై ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు వీక్షిస్తూ సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

ఎస్పీ సెట్ కాన్ఫరెన్స్

సిబ్బందితో సెట్ కాన్ఫరెన్స్‌ను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి నిర్వహించారు. వర్షాలు పూర్తిగా తగ్గేంత వరకు సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే డయల్ 100, 93929 03413 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

నగరంలో సహాయక చర్యలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు బాబీ, కల్యాణ్‌రాజు, సుబ్బారావు, నారాయణ, రాములు నాయక్ ముమ్మరం చేశారు. అండర్ బ్రిడ్జిల వద్ద పలు వాహనాలు నీటిలో చిక్కుకుపోవడంతో క్రేన్ల సాయంతో బయటకు తీసుకొచ్చారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వేమారెడ్డి, శివాజీ చర్యలు చేపట్టారు. అండర్ బ్రిడ్జిలు నీటితో నిండిపోవడంతో అయ్యప్పగుడి ఫ్లయ్‌ఓవర్, వేదాయపాలెం, బీవీనగర్, కొండాయపాళెం, రంగనాయకులపేట, బర్మాషెల్‌గుంట రైల్వే గేట్ల మీదుగా వాహన రాకపోకలు సాగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. అండర్ బ్రిడ్జిల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి రాకపోకలను నిరోధించారు.